ప్రతి రైతూ పంట నమోదు చేసుకోవాలి

- జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు బి.చంద్రనాయక్

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె: సాగు చేసే ప్రతి రైతూ పంట నమోదు చేసుకోవాలని జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు బి.చంద్రనాయక్ పేర్కొన్నారు. మండలంలోని ఓబులంపల్లి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోందని కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జెడిఎ హాజరై రైతులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. అవసరం అయితే తప్ప రసాయనిక పురుగు మందులు వాడకూడదని సూచించారు. చాలా తక్కువ మోతాదులో యూరియా వినియోగించుకోవాలన్నారు. సేంద్రీయ ఎరువులతో మాత్రమే పంటలు పండించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలని చెప్పారు. వ్యవసాయ శాఖలో అమలవుతున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.ఈశ్వర్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం ఇన్‌ఛార్జి రామ్మోహన్‌రెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

యూరియా.. వెతలు!

- బి.మఠం, చాపాడులో తీవ్ర కొరత
- అధిక ధరలతో రైతులు బెంబేలు
- యూరియా బస్తా రూ.400?!

జిల్లా రైతాంగాన్ని యూరియా కొరత వెంటాడుతోంది. జిల్లా అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని చెబుతున్న అధికారుల మాటలకు క్షేత్రస్థాయికి మధ్య వ్యత్యాసం కనిపిస్తోంది. జిల్లాలోని కర్నూలు-కడప కాల్వ, తెలుగుగంగ ఆయకట్టు ప్రాంతాల్లో సుమారు రెండు లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. వరి పంటకు ప్రాథమిక దశలో యూరియాను వినియోగించడం తప్పనిసరి. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా యూరియా దొరకని పరిస్థితి ఏర్పడింది. జిల్లాలోని రైతు సేవా కేంద్రాలు, వ్యవసాయ సహకార కేంద్రాల దగ్గర దొరకని పరిస్థితి కనిపిస్తోంది. కేంద్రం ఎరువుల వినియోగాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో రాష్ట్రానికి నిధుల ఎర చూపి యూరియా కొరతను సృష్టిస్తోందనే వాదన వినిపిస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 3,32,160 ఎకరాల్లో పంటలు సాగు చేయాలని జిల్లా వ్యవసాయశాఖల ప్రణాళిక. కడప జిల్లాలో 1,91,363 ఎకరాలను సాగు చేయాల్సి ఉంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో ప్రధానంగా వరి, పత్తి, వేరుశనగ, కంది పంటలను పెద్దఎత్తున సాగు చేయడం పరిపాటి. 63,653 మెట్రిక్ టన్నులు ఎరువులు అవసరమని వ్యవసాయ శాఖ ప్రతిపాదించింది. జిల్లాలోని జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని కర్నూలు-కడప కాల్వ, తెలుగుగంగ ఆయకట్టు ప్రాంతాల్లో పెద్దఎత్తున వరి పంటను సాగు చేసిన సంగతి తెలిసిందే. 20,538 టన్నుల యూరియా అవసరమని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ప్రభుత్వం 16,875 మెట్రిక్ టన్నులు కేటాయించింది. ఆగస్టులో 4,850 మెట్రిక్ టన్నులు, సెప్టెంబర్‌లో తాజాగా 1,050 మెట్రిక్ టన్నులు కేటాయించింది. వీటిని 342 రైతు సేవా కేంద్రాలకు, 12 పిఎసిఎస్ బ్రాంచ్‌లకు పంపిణీ చేసింది. క్షేత్రస్థాయిలో అవసరాలకు అనుగుణంగా యూరియా లభించని పరిస్థితి నెలకొంది.

చాపాడులో దుకాణం ముందు యూరియా కోసం ఎదురు చూస్తున్న రైతులు (ఫైల్)

యూరియా కోసం వెతలు

జిల్లాలోని నదీ పరీవాహక ప్రాంతాల్లో యూరియా కొరత వెంటాడుతోంది. బ్రహ్మంగారిమఠంలో 50 టన్నుల యూరియా నిల్వ ఉన్నట్లు సమాచారం. మండల పరిధిలోని సోమిరెడ్డిపల్లి, గొడ్లపాడు, తోట్లపల్లి, పలుగురాళ్లపల్లి ప్రాంతాల్లో సుమారు 40 టన్నుల యూరియా కొరత వెంటాడుతోంది. కర్నూలు-కడప కాల్వ, కుందూనదీ, బ్రహ్మసాగర్ ఆయకట్టు ప్రాంతాల పరిధిలోని మైదుకూరు, చాపాడు, దువ్వూరు, కాశినాయన సహా పలు మండలాల్లో యూరియా దొరకని పరిస్థితి నెలకొంది.

అధిక ధరల దరువు

జిల్లాలో యూరియా బస్తా రూ.330 నుంచి రూ.400 చెల్లించాల్సి వస్తోంది. జిల్లాలోని ఆర్‌ఎస్‌కెలు, సొసైటీలు, డిసిఎంఎస్ బ్రాంచ్‌ల్లో రూ.270 లభిస్తోంది. ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిల్వ చేయకుండా, నెలవారీగా కేటాయింపులు చేస్తుండడంతో యూరియా కొరత ఏర్పడినట్లు తెలుస్తోంది. యూరియా లభించని రైతులు ప్రయివేటు డీలర్ల దగ్గరకు పరుగులు పెడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలోని కాశినాయన, చాపాడు, మైదుకూరు తదితర ప్రాంతాలకు చెందిన ప్రయివేటు డీలర్లు రైతులను అధిక ధరలతో నిలువు దోపిడీకి గురిచేస్తున్న వైనం ఆందోళన కలిగిస్తోంది.

మొక్కుబడి దాడులు..షురూ!

జిల్లా వ్యవసాయశాఖ విజిలెన్స్ దాడులకు శ్రీకారం చుట్టింది. రెండ్రోజుల కిందట చాపాడు, మైదుకూరు ప్రాంతాల్లో దాడులు చేసి ఆరు టన్నుల ఎరువులను స్వాధీనం చేసుకుని రెండు ఎరువుల దుకాణాలను సీజ్ చేసింది. జిల్లాలో ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, ఎంఆర్‌పి రేట్లకు మించి విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించింది. అయినప్పటికీ ప్రయివేటు డీలర్లు ఖాతరు చేయని పరిస్థితి కనిపిస్తోంది.

యూరియా దొరకడం లేదు

యూరియా దొరకడం లేదు. ౦ండెకరాల్లో వరి నాట్లు వేశా. ప్రయివేటులో బస్తా రూ.400 పలుకుతోంది. అయినప్పటికీ దొరకలేదు. **- బాలిరెడ్డి, రైతు, చౌదరివారిపల్లి, బి.మఠం.**

ఎరువుల కొరత ఉండదు

ఖరీఫ్ అవసరాల మేరకు ఎరువులను అందుబాటులో ఉంచాం. 1,050 టన్నులు పంపిణీ చేశాం. త్వరలో 4,050 టన్నులు రానుంది. యూరియా, ఇతర ఎరువుల కొరతపై అపోహలను నమ్మొద్దు. **-బి.చంద్రానాయక్, జిల్లా వ్యవసాయాధికారి, కడప.**

నేటి నుంచి 'కారుణ్య' కార్మికుల ఆందోళనకు శ్రీకారం

- మున్సిపల్ నగర అధ్యక్షులు సుంకర రవి

ప్రజాశక్తి- కడప అర్బన్

నగరపాలక సంస్థలో పారిశుధ్య, ఇంజి నీరింగ్ సెక్షన్‌లలో కార్మికులు గా పని చేస్తూ మృతి చెందిన, ఉద్యోగ విమరణ పొందిన కార్మికుల కుటుంబాలు వారసత్వ ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తూ ఉన్నారని , వారి డిమాండ్ల సాధన కోసం బుధవారం నుంచి ఆందోళనకు శ్రీకారం చుట్టనున్నామని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) నగర అధ్యక్షులు సుంకర రవి పేర్కొన్నారు. మంగళవారం పాత మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపాదిస్తున్న కుటుంబ పెద్ద, తల్లి, తండ్రి మృతి చెందడంతో ఆయా కుటుంబాలు ఆర్థికంగా వెనుకబడి జీవనం సాగించడమే మృగ్యమై పోయిందని తెలిపారు. ఇప్పటికే అనేక మంది కార్మికులు ఉద్యోగ విరమణ పొందారని తెలిపారు. ఫలితంగా మిగతా కార్మికులపై పనిభారం అధికమైందని చెప్పారు. అధికారులు మాత్రం వారికి మరోవైపు ఉద్యోగాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని చెప్పారు. ఆప్కాస్ పారిశుధ్య, ఇంజి నీరింగ్ విభాగంలో పని చేస్తున్న 9 మంది కార్మికులు 2, 3 సంవత్సరాల కిందట మృతి చెందా రని పేర్కొన్నారు. వారి వారసులకు ఇంతవరకు ఉద్యోగాలు ఇవ్వలేదని తెలిపారు. రిటైర్డ్ అయిన 41 మంది కార్మిక కుటుంబాల్లో 27 మందిని అదనపు కార్మికులకు తీసుకున్నారని, వీరికి నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం దారుణమని పేర్కొన్నారు కడప నగరపాలక సంస్థ అధికారులు రెగ్యులర్ ఉద్యోగులకు సిపిఎస్ కార్డ్స్ ఇవ్వలేదని తెలిపారు. ప్రభుత్వ సెలవులను వర్తింపజేయాలని చెప్పారు. మున్సిపల్ కార్మికులందరికీ, రెగ్యులర్ ఉద్యోగులకు 12వ పిఆర్‌సి ఇవ్వాలని పేర్కొన్నారు. ఆప్కాస్ కాంట్రాక్ట్, అడిషనల్ అనేది కాకుండా అందరికీ పిఆర్‌సి వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. మాసాపేట, శంకరాపురం ఇళ్ల పట్టాలను ఇస్తామని మభ్య పెట్టి కార్మికులకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. సిఐటియు మున్సిపల్ యూనియన్ నగర కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్మికులందరూ ఇందులో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఉపాధ్యక్షులు ఇత్తడి ప్రకాష్, కార్మికులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సుంకర రవి

జెవివి రాష్ట్ర కమిటీలో ప్రొద్దుటూరు సభ్యులకు చోటు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఈ నెల 14న ఆదివారం విజయనగరం పట్టణంలో నిర్వహించిన 18వ రాష్ట్ర జనవిజ్ఞాన వేదిక మహాసభలో భాగంగా రాష్ట్ర నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. ఆ మేరకు నూతన కార్యవర్గంలో ముగ్గురు ప్రొద్దుటూరు వాసులకు చోటు దక్కింది. జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తవ్వా సురేష్, రాష్ట్ర యూత్, సోషల్ మీడియా సబ్ కమిటీ కన్వీనర్‌గా గువ్వా మహేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా ఎన్‌సునీతను ఎన్నుకున్నారు. మంగళవారం ప్రొద్దుటూరుకు విచ్చేసిన రాష్ట్ర జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్ ఈ విషయమై ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రొద్దుటూరు జన విజ్ఞాన వేదిక కమిటీలో విధులు నిర్వహించిన తరహాలోనే రాష్ట్ర కమిటీలో కూడా తమ విధులను సమర్థవంతంగా నిర్వహిస్తామని వారు తెలిపారు. జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులకు ప్రొద్దుటూరు కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

డిఎ, ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు 12వ పిఆర్‌సిని, కరువుభత్యం, మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యామ్ సుందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపిటిఎఫ్ రాష్టవ్యాప్త నిరసనల్లో భాగంగా మంగళవారం కలెక్టరేట్ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం సాచివేత ధోరణి అవలంభిస్తోందని చెప్పారు. ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదిన్నర గడచినా సమస్యల పరిష్కారానికి కృషిచేయలేదన్నారు. 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, 2024 జనవరి నుంచి పెండింగ్‌లో ఉన్న నాలుగు విడతల డిఎలను వెంటనే ప్రకటించాలని పేర్కొన్నారు. సిపిఎస్‌ను రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం డిమాండ్లను పరిష్కరించకపోతే త్వరలో రాష్టవ్యాప్త ఉద్యమం చేపడతామన్నారు. అనంతరం కలెక్టరేట్ ఎఒ విజయ్ కుమార్‌కు వినతి పత్రం అందచేశారు.

కొనసాగుతున్న క్రికెట్ మ్యాచ్‌లు

ప్రజాశక్తి - కడప

ఎసిఎ సౌత్ జోన్ అండర్- 23 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా వైఎస్ రాజారెడ్డి ఎసిఎస్టేడియంలో, కెఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో మ్యాచ్‌లు కొనసాగుతున్నాయి. ఎసిఎ స్టేడియలో కడప, అనంతపురం జట్ల మధ్య నిర్వహించిన మ్యాచ్‌లో మహేంద్ర రెడ్డి డబల్ సెంచరీ చేయడంతో అనంతపురం జట్టు మొదటి లింక్స్ లో 537 పరుగుల భారీ స్కోరు సాధించింది. మూడు వికెట్ల నష్టానికి 364 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 150.4 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 537 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. ఆ జట్టులోని మహేంద్రరెడ్డి బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించి 239 పరుగులు (డబల్ సెంచరీ) చేశాడు. వికాస్ 109 పరుగులు (సెంచరీ) చేశాడు. కడప జట్టులోని ఆదిల్ హుస్సేన్ మూడు, నరసింహ రెండు, చెన్నారెడ్డి రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి మొదటి ఇన్నింగ్స్ లో 29.0 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 109 పరుగులు చేసింది. ఆ జట్టులోని విజయ్ రామిరెడ్డి 59 (నాట్ అవుట్), భరత్ రెడ్డి 40 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని దీపక్ రెండు వికెట్లు తీసుకున్నాడు.

కెఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న వేరొక మ్యాచ్‌లో చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 454 పరుగులు చేసింది. 8 వికెట్ల నష్టానికి 375 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 103.3 ఓవర్లలో 454 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని నికిత గౌడ్ 153 పరుగులు (సెంచరీ) చేశాడు. బాలాజీ 59 పరుగులు చేశాడు. కర్నూలు జట్టులోని కనిష్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి ఐదు వికెట్లు తీసుకున్నాడు. అక్షిత్ రెండు, సాయి సూర్య తేజ రెడ్డి రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి 68.0 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 218 పరుగులు చేసింది. ఆ జట్టులోని కరిముల్లా 46, ధనుష్ నాయుడు 46 (నాట్ అవుట్) పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని బ్రహ్మ సాయి తేజ రెడ్డి మూడు వికెట్లు తీసుకున్నాడు.

తలపడుతున్న కడప, అనంతపురం జట్లు

వైద్య కళాశాలలను ప్రయివేట్ పరం చేయడం సిగ్గుచేటు

- పులివెందుల ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి

ప్రజాశక్తి - కడప అర్బన్

పులివెందుల ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రయివేటీకరణ చేయడం దుర్మార్గమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి, జిల్లా ఉపాధ్యక్షులు రాజ శేఖర్ రెడ్డి అన్నారు. ప్రవేటీకరణను వ్యతిరేకిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలను అందించాలన్న ఉద్దేశంతో పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కళాశాల పనులను నిలిపివేసి పిపిపి(పబ్లిక్ ప్రయివేట్, పార్ట్‌నర్‌షిప్) పద్ధతిలో కొనసాగించడానికి కేబినేట్ తీర్మాణించడం అన్యాయమన్నారు. ప్రయివేటీకరిస్తే పేదలకు వైద్యం అందే పరిస్థితి ఉండదని, ప్రభుత్వమే వైద్య కళాశాలను నడపాలని డిమాండ్ చేశారు. పిపిపి విదానాన్ని రద్దు చేయకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే వచ్చే అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా చలో అసెంబ్లీకి సిద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు జాలా సుమంత్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, అఖిలేష్, నాయకులు నవీన్, రాజు, రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ఓజోన్ పొర గొప్ప వరం

- ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి
- ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్

ఓజన్ ప్రాముఖ్యతను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - కడప

ఓజోన్ పొర ప్రకృతి మనకు ఇచ్చిన గొప్ప వరమని, ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతి ఒక్కరూ తగ్గించాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి) ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం కళాశాలలో ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఓజోన్ పొర రక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యుని నుంచి వచ్చే హానికరమైన అల్ట్రావయొలెట్ కిరణాల నుంచి భూమిని రక్షిస్తుంది అని తెలిపారు. కానీ మానవ కార్యకలాపాల వల్ల ఇది క్షీణిస్తుంది అన్నారు. ప్రతి ఒక్కరూ తమ స్థాయిలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించటం, రసాయనాల వాడకంలో జాగ్రత్తలు తీసుకోవడం వంటివి పాటించాలి అని సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుని బాధ్యత అని అన్నారు. నేడు మనం తీసుకునే చర్యలు, రేపటి భవిష్యత్తును నిర్ణయిస్తాయి అని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన రసాయన శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ రాజేశ్వరి మాట్లాడుతూ ఓజోన్ పొరను ధ్వంసం చేస్తున్న రసాయనాల గురించి వివరించారు. ముఖ్యంగా క్లోరోఫ్లోరో కార్బన్లు, హైడ్రోక్లోరోఫ్లోరో కార్బన్లు వంటివి వాతావరణంలోకి వెళ్లి ఓజోన్ పొరను ఎలా ప్రభావితం చేస్తున్నాయో వివరంగా తెలియజేశారు. డాక్టర్ బి. రామచంద్ర మాట్లాడుతూ భారత్ సహ అనేక దేశాలు ఓజోన్ పరిరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలపై వివరించారు. మాంట్రియాల్ ఒప్పందం, ఓజోన్ క్షీణతకు వ్యతిరేకంగా దేశాలు చేపడుతున్న చర్యల గురించి వివరించా కార్యక్రమాన్ని ఎన్ ఎస్ ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రోగ్రాం అధికారులు డా. అంకాల నాగరాజు, రమేష్ యాదవ్, శివరామ కృష్ణ, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఓజోన్ పొర లేకపోతే జీవం లేదు

కడప అర్బన్ : ప్రతి సంవత్సరమూ సెప్టెంబర్ 16న అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం నిర్వహించుకుంటామని జెవివి జిల్లా అధ్యక్షులు సమీర్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. భూమిపై జీవరాశిని, హానికరమైన అల్ట్రా వైలెట్ కిరణాల నుంచి రక్షించే ఓజోన్ పొర మనకు అతి ముఖ్యమైన రక్షణ కవచమని పేర్కొన్నారు. పారిశ్రామిక ఉత్పత్తులు, వాహనాల ఉద్గారాలు, ముఖ్యంగా క్లోరో ఫ్లోరో కార్బన్లు, హాలోన్స్ వంటి రసాయనాలు వాడకం వల్ల ఓజోన్ పొర నశిస్తోందని తెలిపారు. దీనివల్ల చర్మ, కేన్సర్, కంటి వ్యాధులు, పంటల దిగుబడి తగ్గడం, వాతావరణ మార్పుల వంటి సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఓజోన్ పొరను కాపాడుకోవడానికి పర్యావరణ హిత పరికరాలను వాడటం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, చెట్లు నాటడం, రీసైక్లింగ్ అలవాటు చేసుకోవడం అవసరమని తెలిపారు.

జనవిజ్ఞానవేదిక కేంద్రీకరించిన పాఠశాల విద్యా నికేతన్ ఎయిడెడ్ పాఠశాలలో ప్రపంచ ఓజోన్ డేను నిర్వహించారు. పిల్లల్లో ఓజోన్ ప్రాముఖ్యతను, అది లేకుంటే కలిగే నష్టాలను, ఆ నష్టాలు దేనిగురించి వస్తుందో ప్లకార్డులు ద్వారా, ఒక స్కిట్ ద్వారా అవగాహన కల్పించారు. ప్రజలు, పిల్లలు తల్లిదండ్రులు తిలకించారు. ఇందులో సీనియర్ జెవివి నాయకులు పల్లా వెంకటేశ్వర్లు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైవీయూలో ముగిసిన ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి -కడప అర్బన్ : యోగి వేమన యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ విభాగ గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం కోసం వాక్ ఇన్ ఇంటర్వ్యూలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. అభ్యర్థుల బోధన నైపుణ్యత, అర్హతలను పరిశీలించారు. ఇంటర్వ్యూలలో సబ్జెక్ట్ నిపుణులు అనంతపురం ఎస్.కె. యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎం.వి.శ్రీనివాసన్, వైవీయూ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి. శ్రీనివాస్, డీన్లు ప్రొ పి.రమాదేవి, ప్రొఫెసర్ వై. సుబ్బరాయుడు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ సైన్సెస్ విభాగ అధిపతి డా.కె.రామ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

21న నెలనెలా సీమ సాహిత్యం

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా 147వ సదస్సును ఈనెల 21న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు 'ఎం.వి.లోకనాథం జీవితం - సాహిత్యం' అనే అంశంపై ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి ప్రసంగిస్తారన్నారు.

మద్దతు ఇచ్చిన పార్టీలకు చెంపపెట్టు

- ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు సలావుద్దీన్

ప్రజాశక్తి- కడప అర్బన్



వక్ఫ్ సవరణ చట్టంలోని కొన్ని వివాదాస్పద సవరణలపై దేశ అత్యున్నత న్యాయ స్థానం మధ్యంతర తీర్పు ఇవడం, బిల్లును సమర్థించి, మద్దతిచ్చిన రాజకీయ పార్టీలకు చెంపపెట్టు అని ముస్లిమ్ సమైక్యా వేదిక రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ యావత్ ముస్లిం సమాజం వక్ఫ్ సవరణ చట్టం బిల్లు-2024ను రూపొందించిన అనంతరం తమ నిరసనలు దేశవ్యాప్తంగా తెలిపినా, అభ్యంతరాలను వ్యక్తం చేసినా పట్టించుకోకుండా తమ అనుకూలంగా ఉండే పార్టీల మెజారిటీ సభ్యులతో జాయింట్ పార్లమెంట్ కమిటీ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ప్రతిపక్ష సభ్యుల అభ్యంతరాలను కూడా పట్టించుకోకపోవడం దారుణమని వాపోయారు. తమ అనుకూల సభ్యుల సూచనలతో నివేదికను సిద్ధం చేసి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించిన బిల్లులో వివాదాస్పదంగా ఉన్న అంశాలపై మెజారిటీ ముస్లిములు, బిల్లును వ్యతిరేకించిన రాజకీయ పార్టీల సభ్యులు తెలిపిన అభ్యంతరాలపై సుప్రీంకోర్టు మధ్యంతర తీర్పు ఇవ్వటం ప్రజాస్వామ్యానికి శుభ సంకేతమని అన్నారు. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామ్యం ఉన్నంత మాత్రాన ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాలు ఢిల్లీ పాలకుల మెప్పు పొందేందుకు ఎలా పడితే అలా మద్దతు ఇస్తే ప్రజాస్వామ్యంలో చెల్లదని పేర్కొన్నారు. ముస్లిముల సంక్షేమం కోసం రాజ్యాధికారంలో వాటా కల్పించి చట్టసభలలో సరైన సంఖ్యలో సభ్యులుగా పంపి ఆ తర్వాత చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రయివేట్ ఆస్పత్రుల దోపిడీలను అరికట్టాలి

- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్

అజిల్లాలో ప్రస్తుతం జ్వరాలు ఎక్కువ అవుతున్న తరుణంలో ప్రయివేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు ఇదే అదునుగా చూసుకుని ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నాయని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం విష జ్వరాలు ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు. విష జ్వరాలు బారిన పడిన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితిని జిల్లాలోని కొన్ని ప్రయివేటు ఆసుపత్రులు రకరకాల టెస్టుల పేరుతో పరీక్షలు నిర్వహించి చికిత్స కోసం ప్రజల వద్ద నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. ఇదే అదునుగా చూసుకున్న డయాగ్నొస్టిక్ సెంటర్లు కూడా అధిక ఫీజులు టెస్టులకు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఆసుపత్రులు యాజమాన్యాలు డయాగ్నొస్టిక్ సెంటర్లతో కలిసి కమీషన్‌తో ప్రజలను పంపిస్తున్నారని అన్నారు. ఆర్‌ఎంపి క్లినిక్ నడుపుకునే వారు కూడా అర్హత లేకున్న సెలెన్ బాటిళ్లు ఎక్కిస్తూ ఇంజక్షన్ వేస్తూ డబ్బులు అధికంగా వసూలు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాట ఆడుతున్నారన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికార ఇటువంటి వాటిపై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే పక్షంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

'మొల్ల'కు గొప్ప కీర్తి తెచ్చిన 'గానుగపెంట'

ప్రజాశక్తి - కడప అర్బన్ :

తెలుగులో మొట్టమొదటిసారిగా రామాయణాన్ని రచించిన మొల్లమాంబ కీర్తిని దేశ విదేశాల్లో వ్యాపింప చేసిన ఘనత విద్వాన్ డాక్టర్ గానుగ పెంట హనుమంతరావుకే దక్కుతుందని వైఎస్‌ఆర్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. హనుమంతరావు 79వ తొమ్మిదవ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం కడపలో ఉన్న వారి స్వగృహం వెళ్లి వైఎస్‌ఆర్ జిల్లా రచయితల సంఘం, గానుగపెంట వారి శిష్యులు, బంధువులు, అభిమానులు పుట్టినరోజు శుభాకాంక్షలు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ భూమిరెడ్డి రవి కళ్యాణ్, మనోజ్, సుబ్బమ్మ, ప్రముఖ రచయిత జ్యోతి జార్జ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రామ్మూర్తి నాయుడు, కోశాధికారి నగేష్, మేకల వెంకటరమణ, సుధాకర్, ఖాదర్‌బాషా, రాణా ప్రతాప్, అంజి, సూర్యుడు, హరి, వేద పండితుడు సుదీర్ శర్మ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా అవకతవకలపై ఉద్యమం

ప్రజాశక్తి - కడప

ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని నిర్వహిస్తుందని డిసిసి అధ్యక్షులు విజయ జ్యోతి అన్నారు. ఇందులో భాగంగా ఈనెల 15 నుండి అక్టోబర్ నెల 15 వరకు కడప జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఇంటింటికి వెళ్లి సంతకాల సేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. మంగళవారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాహుల్ గాంధీ ఓటు హక్కుపై యుద్ధం ప్రారంభించారన్నారు. బిజెపి ప్రభుత్వ హయాంలో బతికిన వారు చనిపోయినట్లు, లేనివారి ఓట్లు సృష్టించారని పేర్కొన్నారు. మంచి ప్రజాప్రతినిధులను, పాలకులను ఎన్నుకోవాలని ఓటు హక్కు కల్పిస్తే దాన్ని అధికారంలో ఉన్న పార్టీలు తుంగలో తొక్కుతున్నాయన్నారు. ఈ విషయంపై ఓటర్లను, ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు పిసిసి అధ్యక్షులు వై.ఎస్. షర్మిల ఆదేశాల మేరకు ఇంటింటికి వెళ్లి సంతకాల సేకరణ నిర్వహిస్తున్నామని చెప్పారు. సంతకాల సేకరణ జాబితాను ఎలక్షన్ కమిషను కు పంపిస్తామన్నారు. విలేకరుల సమావేశం అనం తరం కడప నగరంలోని 27వ డివిజన్ ఇన్‌ఛార్జి షామీర్ ఉషన్ అభ్యర్థన మేరకు నగరంలో ఓట్ చోరీ- గద్దె చోడో కార్యక్రమాన్ని విజయ జ్యోతి లాంచనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో కమలాపురం, పులివెందుల, ప్రొద్దుటూరు నియోజక వర్గాల ఇన్‌ఛార్జులు మీగడ అశోక్ కుమార్ రెడ్డి, ధ్రువ కుమార్ రెడ్డి, ఇర్ఫాన్‌బాష, కడప నగర అధ్యక్షులు సయ్యద్ గౌస్ పీర్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్, జిల్లా ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, కడప నగరంలోని డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు విజయజ్యోతి

అసంపూర్తిగా బ్రహ్మసాగర్ కట్ట పనులు

ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని మిగులు పనులు - వర్షాకాలంలో బురదమయం

బ్రహ్మసాగర్ కట్టపై ఉన్న మట్టి రోడ్డు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండల కేంద్రంలోని బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు కట్ట పనులు ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉన్నాయి. గత వైసిపి ప్రభుత్వం రూ.50 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ఈ పనులు చేసేందుకు మెగా కన్స్ట్రక్షన్ బాధ్యతలు తీసుకుంది. బ్రహ్మంసాగర్ లీకేజీ పనులను పూర్తి చేసి, బ్రహ్మ సాగర్ కట్టపై 7 కిలోమీటర్ల రోడ్డును వేయడం మర్చిపోయారు. తార రోడ్డు లేకపోవడంతో బ్రహ్మంసాగర్ ప్రాజెక్టును చూసేందుకు వచ్చిన వివిధ ప్రాంతాల పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం మరీ అధ్వానం. అంతా బురదమయం. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్రహ్మంసాగర్ కట్టపై రక్షణ కవచంగా బ్యారియర్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది. బ్యారియర్స్ లేకపోవడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. గెస్ట్ హౌస్ వద్ద మరమ్మతు పనులు కూడా నిలిపేశారు. బ్రహ్మంసాగర్ కట్ట పొడవునా లైటింగ్ సిస్టంలో ఏర్పాటు చేయడం కూడా మర్చిపోయారు. అనేకసార్లు బ్రహ్మం సాగర్ అధికారులు కాంట్రాక్టర్లకు తెలిపినప్పటికీ వారు పట్టించుకోలేదనే సమాచారం ఉంది. పనులు చేయలేక పోవడంపై నోటీసులు కూడా ఇచ్చినట్లు తెలిసింది. పనులు చేయరు.. చేయలేమని చెప్పరు అనే విమర్శలు న్నాయి. చేయలేమని చెబితే కొత్త టెండర్లను పిలిచే అవ కాశం ఉంటుందని పలువురు సూచిస్తున్నారు. గత ప్రభుత్వంలో టెండర్లు కావడంతో ఈ ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందా లేదా అంటూ అనుమానం కూడా ఉండడంతోనే పనులు చేయలేదనే మాటలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని వేగవంతంగా బ్రహ్మంసాగర్ కట్టపై అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రక్షణ కోసం ఏర్పాటు చేయాల్సిన బారియర్స్ లేని ప్రదేశం

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఎమ్మెల్యే సహకారంతో ఆలయ అభివృద్ధి

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సహకారంతో అల్లాడుపల్లె వీరభద్రస్వామి ఆలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని ఆ ఆలయ నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఎమ్మెల్యేను ప్రొద్దుటూరులోని ఆయన నివాసంలో వారు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ వీరనారాయణ యాదవ్ మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి ఎమ్మెల్యే తమకు ఆలయ బాధ్యతలు అప్పగించారన్నారు. త్వరలో ఆలయ ఆవరణలో నూతన కమిటీ ఎమ్మెల్యే సమక్షంలో ప్రమాణ స్వీకారాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ శంకర్ బాలాజీ, కెసి కెనాల్ డిస్ట్రి బ్యూటరీ వైస్ చైర్మన్ డి.గురివిరెడ్డి, గ్రామపెద్దలు వీరారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, కమిటీ సభ్యులు ఆర్.వీరారెడ్డి, జిసిజి వీరారెడ్డి, పి.పార్వతి, కె.ఆదిలక్ష్మి, డి. పావని, పి.చెన్నమ్మ, వి.గుర్రమ్మ, విఠం మహేశ్వర్ రెడ్డి, బి.జగన్నాథరెడ్డి పాల్గొన్నారు.

నాయి బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడిగా వెంకటరత్నం

ప్రజాశక్తి - వేంపల్లె

నాయీ బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడిగా వెంకటరత్నం ఎన్నికయ్యారు. అధ్యక్ష పోటీలో వేంపల్లెకు చెందిన వెంకటయ్యగారి రత్నం, కుప్పాలపల్లె శేఖర్ నిలిచారు. వీరి మధ్య పోటీ ఉండడంతో ఎన్నికల ద్వారా ఎన్నుకోవాలని నాయీ బ్రాహ్మణులు కోరారు. అభ్యర్థులు వారం రోజులుగా ప్రచారం చేశారు. అనంతరం మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న త్యాగరాజ స్వామి ఆలయం వద్ద నాయీ బ్రాహ్మణ సంఘానికి ఎన్నికలు జరిగాయి. నాయీ బ్రాహ్మణ సంఘంలో సభ్యత్వం తీసుకున్న వారికి సంబంధించి 123 ఓట్లు ఉండగా, ఓటు హక్కును 121 మంది వినియోగించుకున్నారు. కుప్పాలపల్లె శేఖర్‌కు 56 ఓట్లు రాగా, వెంకటయ్య గారి వెంకటరత్నం 65 ఓట్లు వచ్చాయి. శేఖర్‌పై వెంకటరత్నం 9 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. నాయీ బ్రాహ్మణ సంఘానికి జరిగిన ఎన్నికలకు కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. వెంకటరత్నంకు ఎన్నికల అధికారిగా వ్యవహ రించిన సుబ్రమణ్యం పత్రాన్ని అందజేశారు. వెంకటరత్నం గతంలో కూడా మూడుసార్లు మండల శాఖ అధ్యక్షుడిగా ఉండి నాయీ బ్రాహ్మణ సంఘానికి సేవ చేయడంతోనే ఈ ఎన్నికల్లో గెలుపొందినట్లు నాయీ బ్రాహ్మణులు పేర్కొంటున్నారు.

ప్రకృతి వ్యవసాయోత్పత్తులు ఆరోగ్యాన్నిస్తాయి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రకృతి వ్యవసాయం చేసి వచ్చే దిగుబడులతో ఆరోగ్యం చేకూరుతుందని పెద్దముడియం మండల వ్యవసాయాధికారి జాకీర్ షరీఫ్ తెలిపారు. జంగాలపల్లె గ్రామంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ విధానాలపై జాకీర్ షరీఫ్ రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ రసాయన ఎరువులు వాడడం ద్వారా అనేక రోగాల బారిన పడాల్సి వస్తోందన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు వినియోగిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఆర్ఎస్‌కేలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించడం కోసం నీమాస్త్రం తయారు చేశారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి గురుమూర్తి, మోడల్ మేకర్ దస్తగిరి, ఐసిఆర్‌పిలు సుమలత, వెంకటేశ్వర్లు, డిజిటల్ నరసింహ, ఆర్ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడి డ్రైవర్‌కు గాయాలు

ప్రజాశక్తి - ముద్దనూరు

ఎరువుల లోడు దింపడానికి ట్రాక్టర్‌లో వచ్చి తిరిగి వెళుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపు తప్పి చక్రాల కింద పడి డ్రైవర్ గంగయ్య తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చాపాడు మండలం అన్నవరం గ్రామానికి చెందిన ట్రాక్టర్లో డ్రైవర్ గంగయ్య ఎరువుల లోడుతో సోంపల్లి గ్రామానికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో మండలంలోని మాదన్నగారి పల్లె గ్రామ సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పింది. ముద్దనూరు 108లో ఈఎంటి శ్రీనివాసులు, పైలట్ సుబ్రమణ్యం ప్రథమ చికిత్స చేస్తూ ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని చిలకల బావి వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందారు. మరో ఇద్దరికి ఇద్దరికీ గాయాలయ్యాయి. వివరాలు.. ఖాజీపేట మండలం త్రిపురవరం గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన తల్లీతండ్రి, కుమారుడు బైక్‌పై కడపకు వచ్చారు. చిలకల బావి వద్దకు రాగానే ముందు వెళ్తున్న బస్సును ఓవర్‌టేక్ చేశారు. ఆ సమయంలో తల్లి ఆదిలక్షుమ్మ బైకుపై నుంచి జారీ కిందపడింది. అప్పుడే వెనుక నుంచి వస్తున్న బస్సు ఆమెపై నుంచి వెళ్లడంతో అక్కడిక్కడే మృతిచెందింది. ఈ ప్రమాదంలో తండ్రి, కుమారుడికి గాయాలయ్యాయి. దీంతో త్రిపురవరం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బాలికల కళాశాలల్లో ఉర్దూ మీడియం ప్రవేశ పెట్టాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల బాలికల జూనియర్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాలలో ఉర్దూ మీడియాన్ని ప్రవేశ పెట్టేలా చర్యలు తీసుకోవాలని మంగళవారం ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డికి జూనియర్, డిగ్రీ కళాశాలల అధ్యాపకులు, ఆయా విద్యాసంస్థల్లో ఉర్దూ మీడియం ప్రవేశపెట్టాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్సీతో మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని విద్యార్థినుల భాషా అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఉర్దూ మీడియం ప్రారంభించడం వల్ల అనేకమంది విద్యార్థినులు ఉన్నత విద్యను సులభంగా కొనసాగించవచ్చని వివరించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన అనంతరం ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైన అనుమతులు లభించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి బొజ్జా మైసురారెడ్డి, మహేశ్వరరెడ్డి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

అధికారుల పనితీరు మారకపోతే చర్యలు తప్పవు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

అధికారుల పనితీరులో మార్పురాకపోతే చర్యలు తప్పవని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ హెచ్చరించారు. మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశాన్ని ఎంపిపి వీరనారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే విచ్చేశారు. ఆయనకు ఎంపిపి పుష్ప గుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు. అనంతరం శాఖల వారీగా అధికారులు ఒక్కొక్కరూ మండలంలో ఉన్న సమస్యలను, మండలంలో చేయవలసిన పనుల గురించి వివరించారు. ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ భూములు కబ్జాలు జరుగుతున్న రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వీఆర్వోలు మండల కేంద్రానికే పరిమితం అవుతున్నారు. తమ పంచాయతీలలో ప్రజలకు అందుబాటులో లేకపోవడంపై ఆయన మండిపడ్డారు. విద్యుత్ సమస్యలు వచ్చిన వెంటనే వాటిని పరిష్కరించాలని ఏఈకి తెలిపారు. మండలంలోని వైద్యశాఖ పనితీరు మెరుగుపడాలన్నారు. పంచాయతీ అధికారులు పారిశుధ్యంపై ప్రత్యేకదృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. మండలంలో ఎరువుల కొరత ఉందని, ఓ ప్రణాళిక ప్రకారం ఎరువుల కొరత లేకుండా తక్షణమే అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు తమ పరిధిలో ఉన్న రిపోర్టులు తేకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారుల పనితీరు మారి సరిగ్గా విధులు నిర్వహించకపోతే వచ్చే మండల సర్వసభ్య సమావేశంలో చర్యలు తప్ప ఉన్నారు. సమావేశంలో ఎంపీడీవో కిషోర్, సర్పంచులు, ఎంపీటీసీలు, మైదుకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏపీ రవీంద్ర పాల్గొన్నారు.

చిన్నారులను ఆదుకోవడం అందరి బాధ్యత

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రతిభావంతుల చిన్నారులను ఆదుకోవడం అందరి బాధ్యతని ఎంఇఒ వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక భవిత కేంద్రంలో విద్యాభ్యాసం చేసే ప్రతిభావంతుల చిన్నారులకు రిటైర్డ్ ఎంఇఒ రామ మోహన్‌రెడ్డి, వెంకటరవణమ్మ మనవరాలు ధృతిసాయి 4వ పుట్టిన రోజు వేడుకలు సందర్భంగా రూ.50 వేలు నగదును అందజేశారు. ప్రతిభావంతుల చిన్నారుల సంక్షేమానికి ఇచ్చిన నగదును అవసరమైన ఫిజియోథెరఫి పరికరాలను, చిన్నారులకు ప్రతిరోజూ పాలు, పండ్లు అందివ్వాలని దాతలు డాక్టర్ హరికిరణ్‌రెడ్డి, డాక్టర్ అరుణ సూచించారు. దాతలు, వారిని ప్రోత్సహించిన ఉషాకిరణ్ పాఠశాల కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డికి భవిత కేంద్రం తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ-2 స్టాలిన్ ఐజాక్, ఐఇఆర్టీలు యశోద, సుజాత, ఫిజియోథెరఫి డాక్టర్ ఆనంద్, ప్రాథమిక మెయిన్ పాఠశాల హెచ్ఎం ఆంజనేయులు, సిఆర్‌పిలు నాగరాణి, కల్యాణి, సూర్యకుమారి, తల్లితండ్రులు పాల్గొన్నారు.

యూరియా వాడకం తగ్గించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

యూరియా వాడకం తగ్గించి శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సూచనల మేరకు వాడుకోవాలని ఎఒ వెంకటకృష్ణారెడ్డి రైతులకు సూచించారు. యామవరం, చింతకుంట గ్రామాల్లో మంగళవారం ఎఒ ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. యూరియా అనవసరంగా వాడితే పంట ఏపుగా పెరిగి దోమపోటుకు గురవుతుందన్నారు. దిగుబడులపై ప్రభావం చూపుతుందన్నారు. జిప్సం అవసరమైన రైతులు తిమ్మాపురం, ముద్దనూరు రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి పంటను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని సూచించారు. రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

వేముల : గొందిపల్లి గ్రామంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ తక్కువ పెట్టుబడులతో నాణ్యమైన పంటలు పండించాలంటే ప్రకృతి వ్యవసాయం ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం ఆచరించడం వల్ల రసాయన వాడకం తగ్గి, పురుగుమందుల అవశేషాలులేని ఉత్పత్తులు పొందవచ్చన్నారు. తద్వారా నేల, ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ సురేష్, ఎంపీఓ ఏపీ సిఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి బయోమెట్రిక్ తప్పనిసరి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

సచివాలయ ఉద్యోగులందరూ బయోమెట్రిక్ హాజరును తప్పకుండా నమోదు చేసుకోవాలని డిఎల్‌డిఓ రామాంజనేయులురెడ్డి తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎల్‌డిఓ మాట్లాడుతూ పనులు నాణ్యతగా జరిగేలా అధికారుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. గ్రామాల్లో జరుగుతున్న రోడ్డు పనులు. తాగునీటి సరఫరా గురించి పిఆర్ ఎఇ వినయ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ రామ్మోహన్‌రెడ్డితో చర్చించారు. ప్రభుత్వం చేపట్టిన సర్వేలు, ఎస్ఏఎస్ఏ కార్యక్రమాల గురించి పంచాయతీ కార్యదర్శులకు సూచనలిచ్చారు. ప్రభుత్వం చేయమన్న ప్రతి సర్వేను సచివాలయ సిబ్బంది విధిగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట రమణయ్య, ఇఒపిఆర్‌డి రంతులయ్య, అధికారులు, సెక్రటరీలు పాల్గొన్నారు.

డాక్టరేట్ పొందిన మాధవరావుకు సన్మానం

ప్రజాశక్తి - వేంపల్లె

వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న గ్రంథాలయ అధికారి పీ మాధవరావు డాక్టరేట్ పొందడం పట్ల ఆ కళాశాల అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మాధవరావుకు సన్మానం చేశారు. ఎస్‌వి యూనివర్సిటీలోని గ్రంథాలయ శాఖ అధిపతి ప్రొఫెసర్ కె.సురేంద్రబాబు పర్యవేక్షణలో యూస్ ఆఫ్ పిరియాడికల్స్ బై ది ఫ్యాకల్టీ అండ్ రీసెర్చ్ స్కాలర్స్ ఇన్ ఆంధ్ర అండ్ శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ లైబ్రరీస్ స్టడీ మీద మాధవరావు పరిశోధన సాధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర మాట్లాడుతూ తమ కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకుడికి డాక్టరేట్ రావడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు కూడా పరిశోధన పట్ల మొగ్గు చూపాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బాలకొండ గంగాధర్, కార్యదర్శి డాక్టర్ సుధాకర్, కోశాధికారి డాక్టర్ మల్లేశ్వరమ్మ, డాక్టర్ నాగలక్ష్మిదేవి, డాక్టర్ సతీష్, షఫీద్దీన్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అరవింద్, నీలా కిరణ్మయి, డాక్టర్ రామకృష్ణ, ఓబుల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, తేజేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుకు సాయం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే, వైసిపి నాయకులు

బాధిత రైతుకు వైసిపి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఖాజీపేట

సుంకేసుల గ్రామానికి చెందిన రైతు ఆదిరెడ్డికి వైసిపి నాయకులు మంగళవారం ఆర్థికసాయం చేశారు. ఆదిరెడ్డి ఎద్దులు సోమ వారం ప్రమాదవశాత్తు తుడమలదిన్నె గ్రామ సమీపంలో ఓ వాగులో నీటి ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయి మృతి చెందాయి. బాధిత రైతు జీవనాధారం కోల్పోయాడు. విషయం తెలుసుకున్న మండల వైసిపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి మంగళవారం సుంకేసుల గ్రామానికి వెళ్లి బాధిత రైతును కలిసి సంఘటన గూర్చి అడిగి తెలుసుకున్నారు. వైసిపి నాయ కులు, మాజీ ఎమ్మెల్యే అందరి సహకారంతో రూ.72వేలు నగదు ఇచ్చి ఆదుకున్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా జనరల్ సెక్రెటరీ రాఘవరెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు నాగిరెడ్డి, కొండారెడ్డి సుబ్బారెడ్డి, సర్పం చ్‌లు భూమన సుబ్బారెడ్డి, దుంపలగట్టు సర్పంచ్ రెడ్యం కృష్ణారెడ్డి, శెట్టిపల్లె సిద్ధారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటసుబ్బయ్య, అభిమానులు పాల్గొన్నారు.

విష జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఇటీవల కురిసిన వర్షాలతో పట్టణంలో పలు చోట్ల నీరు నిల్వ ఉండి దోమల బెడద ఎక్కువగా ఉంద న్నారు. దోమకాటుతో ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారని తెలి పారు. ఆ మేరకు చర్యలు చేపట్టాలని కోరుతూ మంగళవారం వైసిపి మున్సిపల్ విభాగం రాష్ట్ర కార్యదర్శి మాడిశెట్టి శివకుమార్ మున్సిపల్ కమిషనర్ శేషఫణికి వినతిపత్ర మిచ్చారు. ఈ సందర్భంగా శివ కుమార్ మాట్లాడుతూ మురుగు నీరు అధికంగా ఉండడం వల్ల దోమలు ప్రబలుతున్నాయని తెలిపారు. సైడ్ కాలవలు శుభ్రం చేయాలని కోరారు. పట్టణంలో పందుల బెడద అధికంగా ఉందన్నారు. ప్రజలపై దాడి చేసే గాయ పరిచిన సందర్భాలు ఉన్నాయని చర్యలు చేపట్టాలన్నారు. బ్లీచింగ్ చల్లడం, దోమల మందు పిచికారి చేయడం వలన దోమల వృద్ధిని అరికట్ట వచ్చన్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు జయ రామకృష్ణారెడ్డి, వైసిపి నాయకులు సూర్య మోహన్ రెడ్డి, కేశవకుమార్ రెడ్డి, చెన్నకేశవరెడ్డి, ఓబుల్‌రెడ్డి, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ శేషఫణికి వినతిపత్రమిస్తున్న వైసిపి నాయకులు

విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతను పాటించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతను పాటించి వ్యాధులకు దూరంగా ఉండాలని తాళ్లపల్లె వైద్యాధికారి సుభాషిణి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉర్దూ రెసిడెన్షియల్ పాఠశాలలో ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. హాస్టల్‌లో ఉన్న విద్యార్థులను డాక్టర్ సుభాషిణి పరీక్షించి జర్వాలు ఉన్న విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భోజనం తినేముందు చేతులు శుభ్రంగా వాష్ చేసుకోవాలన్నారు. వాతావరణ మార్పులతో రోగాలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు. రుతుచక్ర పరిశుభ్రతపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలన్నారు. దోమ కాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కీటక జనిత వ్యాధుల గురించి తెలుసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుగుణమ్మ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ షఫీ వున్నిసా, సూపర్‌వైజర్ అంకయ్య, సిహెచ్ఒ రమాదేవి, స్టాఫ్‌నర్స్ అరుణ, ఆశా, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో, టాక్సీ ఉన్నవారు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలంలో ఆటో, టాక్సీ ఉన్నవారు ప్రభుత్వ ఆర్థిక సహాయం పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ వెంకటరమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సొంత వాహనం ఉన్నవారు 2025-26 సంవత్సరానికి సంబంధించి రూ.15వేలు ప్రభుత్వ ఆర్థికసాయం పొందవచ్చునని తెలిపారు. వాహనదారుడు రాష్ట్రంలో వ్యక్తి అయి ఉండాలని, వాహన రిజిస్ట్రేషన్ పత్రం, ఫిట్నెస్ పత్రం, వాహనదారుడుకి లైసెన్సు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు తప్పకుండా ఉండాలని తెలిపారు. దరఖాస్తుదారుని హౌస్ హోల్డ్‌లో ప్రభుత్వ ఉద్యోగులు ఉండరాదన్నారు. ఆదాయ పన్ను కడుతున్న వారు అర్హులు కారని వివరించారు. 300 యూనిట్లు పైగా ఇంటి కరెంట్ బిల్లు వస్తున్న వారు అర్హులు కారని తెలిపారు. మూడు ఎకరాలు తడి భూమి లేదా పది ఎకరాలకు మించి మెట్ట భూమి ఉన్నవారు కూడా అర్హులు కాదన్నారు. మున్సిపాలిటీ ప్రాంతంలో 1000 చదరపు అడుగులకు మించి ఉండకూడదని, ఒకరి పేరుతో వాహనం ఉండి మరొకరి పేరుతో లైసెన్స్ ఉంటే అర్హులు కారని తెలిపారు. ఎర్రగుంట్ల మండలంలో గతంలో లబ్ధి పొందని వారు ఈనెల 19 లోపు గ్రామ వార్డు సచివాలయాలలో ధ్రువపత్రాలు ఇచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతంలో లబ్ధి పొందినవారు ఈనెల 17లోపు ధ్రువత్రాలను సచివాలయాలలో అందజేయాలని ఆయన సూచించారు.

ఆర్థిక, విద్యా రంగ సమస్యలపై రణభేరి

- యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్‌బాబు

ప్రజాశక్తి - వేంపల్లె

ఏళ్ల తరబడి పరిష్కారంకాని ఆర్థిక, విద్యారంగ సమస్యలపై ఈనెల 15 నుంచి 19 వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న యుటిఎఫ్ రణభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం వేంపల్లె జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రణభేరి కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి సర్వీసు రూల్స్ సమస్యకు పరిష్కారం చూపడం లేదన్నారు. బదిలీలు, ప్రమోషన్లు పూర్తయి మూడు నెలలు కావస్తున్నా ఉపాధ్యాయులు ఇంకా పాత స్థానాల్లో కొనసాగుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు చెరుకూరు శ్రీనివాసులు, సివి రమణ, ఎస్.ఏజాస్ అహ్మద్, రాష్ట్ర కౌన్సిలర్ డివి కృష్ణారెడ్డి, సిపిఎస్ జిల్లా కన్వీనర్ సి.సుదర్శన్, యుటిఎఫ్ మండల నాయకులు టీవీ రమణ పాల్గొన్నారు.

ఆర్‌టిపిపిలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, కార్మికులు

ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఆర్‌టిపిపిలో పెద్ద ఎత్తున రెండో రోజూ నిరసన

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగులు, కార్మికులు రెండో రోజు మంగళవారం పెద్ద ఎత్తున ఆర్‌టిపిపిలో నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవ్వకుండా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని యాజమాన్యాన్ని కోరా మన్నారు. తమ సమస్యలు పరిష్కరించని పక్షంలో ఈ నెల 22 తర్వాత పరిస్థితులపై ఆధారపడి ఉద్యమ కార్యాచరణ ఉంటుందన్నారు. ఉద్యోగులు, కార్మికులు హక్కుల సాధన కోసం ఉత్సాహంగా ఉద్యమంలో పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ యాజమాన్యం తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు.

నేడు చాపాడు మండల సమావేశం

చాపాడు : చాపాడు మండల సర్వ సభ్య సమావేశం బుధవారం ఎంపిపి టి. లక్షుమయ్య అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వీర కిషోర్ తెలిపారు. అధి కారులు పూర్తి స్థాయి నివేదికతో సమావేశానికి హాజరుకావాలని సూచించారు. సర్పంచ్‌లు, ఎంపిటిసిలు గ్రామాల్లో గుర్తించిన సమస్యలను సమావేశంలో తెల పాలన్నారు. ప్రజాప్రతినిధులు మాత్రమే హాజరుకావాలని వారి కుటుంబ సభ్యులు, ఇతరులకు ప్రవేశం లేదని తెలిపారు. అధికారులు ముందస్తు సమాచారం లేకుండా సమావేశానికి గైర్హాజరైతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పేరు మార్పు

నేను, **HARISH KUMAR REDDY THODIME SREE** (పాత పేరు), తండ్రి: పవన్ కృష్ణా రెడ్డి తొడిమే, చిరునామా: 6/23, సున్నాపురల్లపల్లి, కదసాని కొత్తపల్లి, ఎర్రగుంట్ల, కడప, ఆంధ్రప్రదేశ్-516380. నా పేరు **HARISH KUMAR REDDY THODIME SREE** నుండి **SREE HARISH KUMAR REDDY THODIME** గా మార్చుకున్నాను. ఇకపై, అన్ని అవసరాల నిమిత్తం, నేను **SREE HARISH KUMAR REDDY THODIME** గా అని పిలువబడుదును.

మహారాజశ్రీ రాజంపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

I.A.No. 594/2024 IN
I.A.No. 37/2019 IN O.S.No. 34/2013

బుధరపు హేమాన్వి మైనర్ అయినందువలన వారి గార్డియన్, తల్లి బుధరపు ప్రశాంత, భర్త ప్రశాంత్, డోర్ నెంబర్: 13/142/91-A, సంజయ్ నగర్, మల్కాజ్గిరి, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం. ...పిటిషనర్/వాది

Vs

R2. బుధరపు రాంప్రసాద్ తండ్రి రాధాకృష్ణమూర్తి, పుల్లంపేట టౌన్ మరియు మండలం, అన్నమయ్య జిల్లా ప్రస్తుతం కడప టౌన్ మరియు మండలం వైయస్సార్ కడప జిల్లా. ...రెస్పాండెంట్/ప్రతివాది No.2

పిటిషనర్, రెస్పాండెంట్ అయిన మీపై భాగపరిష్కార నిమిత్తమై దావా దాఖలు చేసి మరియు పై పిటిషన్ నందు ప్రిలిమినరీ డిక్రీలో తప్పులు సరిచేయమని కోరుతూ గౌరవ రాజశ్రీ వారి కోర్టులో పిటిషన్ దాఖలు చేయడం జరిగినది. కావున పై పిటిషన్‌లో మీకు ఏమైనా ఆక్షేపణలు యెడల మీరు కానీ, మీ వకీల్ గారి ద్వారా గాని 24.9.2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు పైకోర్టు నందు హాజరై మనవి చేసుకోవలెను, లేనంతట మీ పరోక్షమునందు తీర్మానించబడునని తెలపడమైనది.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్ట్//
పి. వల్లభ రావు
పిటీషనర్ పరం వకీలు
రాజంపేట.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

E.P.No. 141/2024
O.S.No. 525/2023

Nama Anitha, W/o N.Lakshmi Narayana, aged 52 years, House wife, D.No.14, Lakhsmi Nagar, Proddatur Town. ...Petitioner/D.Hr.

Vs

Bandaru Surendra Gupta, S/o Pullaiah, aged 54 years, D.No.3/550-8, YMR Colony, Proddatur Town. ...Respondent/J.Dr.

నోటీసు

పై నెంబరు పిటిషన్‌ను E.P. షెడ్యూల్ దాఖల ఆస్థిని వేలంనకు E.P. దాఖలు చేయడమైనది. అట్టి E.P.లో రెస్పాండెంట్ అయిన నీవు పై కోర్టులో 09.10.2025వ తేదీన ఉదయం 10.30 ని॥లకు నీవు గానీ, నీ తరపున వకీలు హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. అట్లు హాజరు కానంతట నీ పైన పరోక్షంగా తీర్మాణించబడును.

వాయిదా తేది: 09.10.2025

//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు//
కె. సత్యనారాయణ
అడ్వకేట్, ప్రొద్దుటూరు.
సెల్: 9440074659.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

E.P.No. 142/2024
O.S.No. 452/2023

Muthyala Anu Radha, W/o M.V.N.Prabhu, aged 50 years, D.No.4/96, Nehru Road, Proddatur. ...Petitioner/D.Hr.

Vs

Vaddi Giridhar, S/o Ranganadha, aged 36 years, Finance, D.No.2/681-2, Bhakarapet Street, Proddatur Town. ...Respondent/J.Dr.

నోటీసు

పై నెంబరు పిటిషన్‌ను E.P. షెడ్యూల్ దాఖల ఆస్థిని వేలంనకు E.P. దాఖలు చేయడమైనది. అట్టి E.P.లో రెస్పాండెంట్ అయిన నీవు పై కోర్టులో 06.10.2025వ తేదీన ఉదయం 10.30 ని॥లకు నీవు గానీ, నీ తరపున వకీలు హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. అట్లు హాజరు కానంతట నీ పైన పరోక్షంగా తీర్మాణించబడును.

వాయిదా తేది: 06.10.2025

//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు//
కె. సత్యనారాయణ
అడ్వకేట్, ప్రొద్దుటూరు.
సెల్: 9440074659.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE : PRODDATUR
O.S.No. 265/2019

Gulladurthi Seetha Rami Reddy, S/o G.Rami Reddy, R/o D.No.24/574, Vasanthapeta, Proddatur Town & Mandal, Kadapa District. ...Plaintiff

Vs

Koratamaddi Satyanarayana, S/o K.Sree Narasaiah, working as teacher at mandala Praja Parishad School, Gollapalle (Vi), Kamalapuram Mandal, Kadapa District. ...Defendant

MEMO FILED AN BEHALF OF THE PLAINTIFF

పై నెంబరు దావాలో ఒరిజినల్ ప్రామిసరి నోటు రికవరి నిమిత్తం ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో వాది దావా దాఖలు చేసి ఉంటున్నాము. అట్టి దావా యందు ప్రతివాది అయిన నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల 24.09.2025 తేదీన పగలు 10.30 ని॥లకు ఖుద్దున గాని, వకీలు ద్వారా గాని తెలుపుకొనవలెను. లేని ఎడల మీ పైన పరోక్షముగా ఎక్స్‌పార్టీగా తీర్మాణించబడును.

A. SUDARSHANA
Advocate,
PRODDATUR.

దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి దశలవారీ ఆందోళన

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారనికి దశలవారీ ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని సిఐటియు అనుబంధం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ పులివెందుల గౌరవ అధ్యక్షులు గఫూర్, పులివెందుల కమిటీ అధ్యక్షుడు చంద్రమౌళి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఏళ్ల తరబడి పని చేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని ఈనెల 20న ఎస్‌సి విద్యుత్ భవన్ వద్ద కార్మికుల కుటుంబాలతో ధర్నా చేపట్టామన్నారు. ఆ మేరకు మంగళవారం ధర్నా కరపత్రాలను గఫూర్ డ్రైవింగ్ స్కూల్‌లో విడుదల చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రామ్నాథ్ రెడ్డి, ప్రమోద్ కుమార్, శివశంకర్, వరదరాజులు, బాలరాజు, సతీష్ కుమార్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, యోగేశ్వర్ రెడ్డి, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

కరపత్రాన్ని విడుదల చేస్తున్న గఫూర్